# చర్విత చర్వణం

"అమ్మాయి చక్కగా ఉంటుంది. చిదిమి దీపం పెట్టుకోవచ్చు" అన్నారంతా. మనిషికి ఆ మాట నచ్చింది. పెళ్లికి ఒప్పుకున్నాడు. తాళికట్టాడు. నిజమే! చిరు దీపంలా వున్న అమ్మాయి ముఖం పెళ్లి కళతో కళ కళ లాడింది. ప్రకాశవంతమైంది. దేదీప్యంగా వెలిగింది. భోజనాల పంక్తిలో అందరూ ఆ మాటే అన్నారు.

చిలక ముక్కుకు దొండ పండేమిటీ- అని!

మనిషిగాడు శలభంగా కొట్టుకు చావాల్సిందేనా- అని!

ప్రయోజకుడై అమ్మాయిని సుఖపెడతాడంటావా- అని!

ఏం చేస్తాడో, ఏం ఛస్తాడో కొండముచ్చు వెధవా- అని!

....అప్పుడే అక్కడే మొదలయ్యింది. మనిషిలోని మగ అహంకారం-

అమ్మాయి తన స్వంతం! అన్ని హక్కులూ తనవి!! తనేమైనా చేసుకోవచ్చు. తను పక్కనుండగా వ్యక్తి స్వాతంత్ర్యం, దేశ స్వాతంత్ర్యం ఆమెకు వర్తించవు. ఇప్పటిదాకా అందరూ తనను తిట్టిన వారే. అమ్మా నాన్నా, అక్కా, అన్నా, బావ, వదిన, టీచరు, ప్యూను, ఇంటి ప్రక్కవాడు, ఆటోవాడు, షాప్ కీపర్, ఆఫీస్ బాస్ అందరూ.... అందరి కందరూ తిట్టేవారే. తను తిడదామంటే, మడత పేచీ పెడదామంటే, తను కొడదామంటే, కోపంతో ఎగిరి పడదామంటే.... ఏదీ ఒక్కరు, ఒక్కరంటే ఒక్కరు లేరు-

అప్పుడే అక్కడే తిరగబడింది మనిషిలోని సహనం. మడతలుగా, ముడతలుగా కొనసాగిన పాతికేళ్ళ జీవితం.... గంజి పెట్టి

కొట్టిన పోలీస్ యూనిఫాంలా "ఖడగ్గా" తయారైంది. అది ఆ అమ్మాయి పాలిటి "అదుపులోకి తీసుకునే చర్య"- అయ్యింది. ఆమె వ్యక్తిత్వం ముందు కుచించుకు పోయి మనిషిది, "అదుపు తప్పిన చర్య" అయ్యింది. తాళి కట్టిన మరు క్షణం బింకం, పెద్దరికం మనిషికి రొమ్ముమీద మెడల్స్‌లా మెరిశాయి.

ఎన్ని సార్లు తిప్పినా చెయ్యి తిరగక, క్లబ్బుల్లో తన్నులు తిని, ఇంట్లో ఇల్లాలికి వన్‌ఫోర్టీఫోర్ సెక్షన్ పెట్టాడు- మనిషి.

రాత్రి బారు వాడి కారుకూతలకు దండం పెట్టి, పొద్దున్నే ఇంట్లో ఇల్లాలిపై లాఠీచార్జ్ చేశాడు- మనిషి-

పగలంతా రేసుగుర్రాల డెక్కల ధూళిలో నలిగిపోయి, సాయంత్రం ఇంట్లో కర్ఫ్యూ విధించాడు- మనిషి.

నోయి లేకుండా రాత్రంతా ఫుట్‌పాత్ మీదపడి, ఇంటి ఇల్లాలిపై పొద్దున్న టియర్‌గ్యాస్ వదిలాడు- మనిషి.

అతి తెలివి అప్పుల వాళ్ళ దగ్గర సాగక ఖీమా ముద్దలా అయి, బూతుల కాల్పులు జరిపాడు- మనిషి.

* * *

పెళ్ళయి అయిదు దీపావళులు గడిచి పొయ్యాయి-

ఆ అమ్మాయి మనోనిబ్బరం, సహనం, సౌశీల్యం, నిరంతరం దీపాల్లా వెలుగుతూనే ఉన్నాయి.

ఆమె వెలుగును మనిషి సహించలేదు-

ఆమె నవ్వును మనిషి ఆనందించలేదు-

ఆమెను మనిషిగా గుర్తించలేదు-

మనిషి తనను తానే గుర్తించుకోలేదు.

* * *

గంట క్రింతం తనేం చేశాడో తనకు గుర్తులేదు. గుర్తు లేదని కాదు. గుర్తు ఉందనీ కాదు.

తూలుతూ, సోలుతూ వచ్చాడు మనిషి. ఇంటి గుమ్మం ముందు దీపంలా వెలుగుతూ కనిపించే ఇల్లాలు కనిపించలేదు.

గంట క్రితం తనేం చేశాడో తనకు గుర్తులేదు. గుర్తు లేదని కాదు. గుర్తు ఉందనీ కాదు.

వసారాలో తన ఇద్దరు పిల్లల సన్నని రోదనల మధ్య, ఆమె దీపంగా మిగిలి ఉంది-

"అమ్మాయి చక్కగా ఉంటుంది. చిదిమి దీపం పెట్టుకోవచ్చు!!

○

నవంబర్ 1992